ప్రజాశక్తి
ఆదివారం 29 సెప్టెంబర్ 2024
5
అనంతపురం





కొండలో క్వార్ట్జ్ రాయి కోసం జరుగుతున్న తవ్వకాలు

రాయిని దోచి.. కోట్లు కొల్లగొట్టి..!

◆ యథేచ్ఛగా క్వార్ట్జ్ రాయి అక్రమ మైనింగ్
◆ విచ్చలవిడిగా బ్లాస్టింగ్స్
◆ అటువైపు కన్నెత్తి చూడని అధికారులు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

మండల పరిధిలోని ములకలపెంట గ్రామం సర్వే నెంబర్ 228లో 65 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో విలువైన క్వార్జ్(స్పటికం) రాయి ఉంది. ఈ రాయి స్టీల్ వస్తువులను మెరుగు పెట్టడం, విగ్రహాలు, పౌడర్లు, రంగులు తయారీలో విరివిగా వినియోగిస్తారు. పలురకాలకు ఉపయోగపడే ఈ రాయికి మార్కెట్లో గిరాకీ అధికంగా ఉంది. చైనాలోనూ ఈ రాయికి గిరాకీ ఉంది. ఇంతటి గిరాకీ ఉన్న రాయిని కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా దోచేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులూ తీసుకోకుండా అక్రమంగా కొల్లగొట్టేస్తున్నారు. నిబంధనలను భేఖాతరు చేస్తూ కోట్లాది రూపాయల సహజ వనరులను లూటీ చేస్తున్నారు. ఆమిన్‌పల్లి గ్రామం సర్వే నెంబర్ 1/1లో 11.30 ఎకరాలను సుధాకర్ అనే వ్యక్తి రాయి తరలింపునకు 2000 సంవత్సరంలో లీజ్‌కు తీసుకున్నాడు. ఆయన నుంచి జిందాల్ ఫ్యాక్టరీకి చెందిన సంతోష్ లార్డ్ అనే వ్యాపారి సబ్ లీజ్ తీసుకున్నాడు. ఆయన పరిధిలో ఉన్న భూ భాగంలో రాయిని తవ్వుకుని వెళ్లిపోయాడు. ఆతరువాత కొందరు వ్యాపారులు అమీన్‌పల్లికి సంబంధంలేని 258 సర్వే నెంబర్ ములకలపెంట గ్రామానికి చెందిన క్వారీలో తవ్వకాలు చేపట్టారు. క్వారీ ద్వారా రాయిని తరలించాలంటే లైసెన్స్ ఫీజు, లీజు, సెస్సు, రాయల్టీ తదితర ప్రభుత్వ అనుమతులు ఉండాలి. ఇవేవి లేకుండానే అక్రమార్కులు రాయిని కొల్లగొట్టేస్తున్నారు. ఇష్టానుసారంగా బ్లాస్టింగ్‌లు చేసి రాయిని దోచుకుపోతున్నారు. విచ్చలవిడిగా జరుగుతున్న ఈ బ్లాస్టింగ్‌లతో సమీప గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ లారీలు నిత్యం ఈ గ్రామాల రహదారుల గుండా రాకపోకలు సాగిస్తుండడంతో గ్రామీణ రోడ్లు ఛిద్రం అవుతున్నాయి. ఈ విషయాలపై మైనింగ్ పనులను చేస్తున్న వారిని ఎవరైనా ప్రశ్నిస్తే తమ వద్ద అన్ని అనుమతులున్నాయని చెబుతారే తప్పా వాటిని చూపించరు. అధికారులు సైతం ఈ అక్రమ మైనింగ్‌పై చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం పలు ఆరోపణలుకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు ఈ అక్రమ మైనింగ్‌ను నియంత్రించి, ప్రకృతి సంపదను కాపాడాలని సమీప గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ధర్మవరం మున్సిపల్ కార్యాలయం





కమిషనర్ మల్లికార్జున



ధర్మవరం..

కూటమిలో కొట్లాట..!

◆ మున్సిపల్ కమిషనర్ చుట్టూ వివాదం
◆ బిజెపి, టిడిపి మధ్య ఘర్షణ వాతావరణం
◆ మంత్రి కార్యాలయం వద్ద ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ధర్మవరంలో తెలుగుదేశం, బిజెపి కూటమి మధ్య గత కొంతకాలంగా కుంపటి రగులుతోంది. ప్రారంభం నుంచి టిడిపి, బిజెపిల మధ్య ఈ ఆదిపత్యపు పోరు నడుస్తూనే ఉంది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో అనూహ్యంగా బిజెపి అభ్యర్థిగా సత్యకుమార్ ఇక్కడికి విచ్చేశారు. అంతకు మునుపు వరకు ఆయన కడప జిల్లాకు చెందిన వారిగా ఉంటూ వచ్చారు. ఎన్నికల నామినేషన్ల సమయంలో వచ్చినప్పటికీ టిడిపి సహకారంతో ఇక్కడ బిజెపి విజయం సాధించింది. అంతకు మునుపు వరకు బిజెపికి మాజీ ఎమ్మెల్యే జి.సూర్యనారాయణ ఉండేవారు. ఇటు టిడిపికి పరిటాల శ్రీరామ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. సార్వత్రిక ఎన్నికల్లో గోనుగుంట్ల సూర్యనారాయణకు బిజెపి టిక్కెట్టు ఖరారు అని ప్రచారం సాగింది. అయితే చివరి నిమిషంలో ఆయనకు కాకుండా సత్యకుమార్ తెరపైకి వచ్చాడు. సూర్యనారాయణతో ముందు నుంచి ఉన్న విభేదాల నేపథ్యంలో శ్రీరామ్ సత్యకుమార్‌కు గత ఎన్నికల్లో మద్దతు పలికారు. ఆయన తరుపున ప్రచారం నిర్వహించారు. ఇక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సత్యకుమార్ వైద్యఆరోగ్య శాఖ మంత్రి అయ్యారు. ఈ నేపథ్యంలో అప్పటి వరకున్న టిడిపికి, కొత్తగా అధికారంలోకి వచ్చిన బిజెపికి మధ్య ఆధిపత్య పోరు ప్రారంభమైంది. సత్యకుమార్ మంత్రి అయ్యి నియోజకవర్గానికి వచ్చిన సమయంలో తొలి సమావేశంలోనే టిడిపి, బిజెపి నాయకులు ఘర్షణ పడ్డారు. ఆ తరువాత బత్తలపల్లిలోనూ ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.

ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున బదిలీ వ్యవహారం టిడిపి, బిజెపి మధ్య పెద్ద ఘర్షణనే రాజేసింది. ఏకంగా టిడిపి శ్రేణులు శనివారం నాడు మంత్రి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. గత వైసిపి పాలనలో మల్లికార్జున టిడిపి నాయకులకు వ్యతిరేకంగా పనిచేయడమే కాకుండా ఏ మాత్రం విలువనివ్వలేదని ఆ పార్టీ నాయకులు మండిపడుతున్నారు. అటువంటి వ్యక్తిని కూటమి ప్రభుత్వ హయాంలో మళ్లీ ఇక్కడికే తీసుకురావడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి సత్యకుమార్ తక్షణం మల్లికార్జునను బదిలీ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే అందుకు సత్యకుమార్ సుముఖంగా లేనట్టు తెలుస్తోంది. ఉద్యోగులతో పనిచేయించుకోవాలిగానీ బదిలీలు చేయడం సరైంది కాదని అంటున్నారు. దీంతో ఆయన్ను బదిలీ చేసే వరకు వదిలేది లేదని టిడిపి నాయకులు నిరసనలకు దిగుతున్నారు. ఒకానొక దశలో అటు టిడిపి, బిజెపిల మధ్య మాటాల యుద్ధమే కాకుండా ప్రత్యక్ష దాడులు కూడా జరిగే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఇది ఎంత వరకు వెలుతుందోనని కూటమి నేతల్లో గుబులు రేపుతోంది. ఇదే కాకుండా ఇతర పనుల విషయంలోనూ టిడిపి, బిజెపి నేతల మధ్య పరస్పరం పోరు నడుస్తోంది. నియోజకవర్గంలో తమ పట్టును నిలుపుకునేందుకు టిడిపి నేతలు ఒకవైపు ప్రయత్నిస్తుండగా, తమ బలాన్ని పెంచుకునేందుకు బిజెపి ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య కుంపట రాజుకుంది. ఇది ఇంకా ఎంత దూరం వెలుతుందో చూడాల్సి ఉంది. రెండు పార్టీల అధిష్టాలు దీనిపై ఇప్పటికీ పెదవి విప్పలేదు. మౌనంగా వీక్షిస్తుండటం గమనార్హం.

ధర్మవరం బీజేపీ కార్యాలయం ఎదుట టిడిపి నేతల ధర్నా

ధర్మవరం రూరల్ : ధర్మవరం మున్సిపల్ కమిషనర్ నియామకం విషయంపై ధర్మవరం తెలుగు తమ్ముళ్ల ఆందోళనకు దిగారు. కొత్త కమిషనర్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయం ముందు శనివారం నాడు ఆందోళన చేపట్టారు. మంత్రి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం హయాంలో ధర్మవరంలో మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన మల్లికార్జున మళ్లీ ఇక్కడికి తీసుకురావడం సరికాదన్నారు. ఆయన కమిషనర్‌గా ఉన్నన్ని రోజులూ టిడిపి నేతలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఆ అధికారిని మళ్లీ తీసుకురావడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. ఆందోళన విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, 2వ పట్టణ సిఐ రెడ్డప్ప సిబ్బంది అక్కడి చేరుకున్నారు. టిడిపి నాయకులతో మాట్లాడి సర్ది చెప్పి అక్కడి నుంచి పంపించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి పట్టణ అధ్యక్షుడు పరిసే సుధాకర్, వార్డు ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.




ధర్మవరంలో మంత్రి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

నేడు 'రాజ్యం-విప్లవం' నేటి సమకాలీనతపై సదస్సు

హాజరు కానున్న ప్రొఫెసర్ వికె.రామచంద్రన్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం నాడు సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం అశోక్‌నగర్‌లోని అలేఖ్య ఫంక్షన్ హాల్లో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. 'రాజ్యం-విప్లవం' నేటి సమకాలీనత అన్న అంశంపై నిర్వహించే సదస్సుకు ముఖ్య వక్తగా కేరళ ప్రభుత్వ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ వికె.రామచంద్రన్ ముఖ్య వక్తగా రానున్నారన్నారు. వికె.రామచంద్రన్ అనంతపురం జిల్లాలో పంటల్లో వస్తున్న మార్పులను ఎంఎస్ స్వామినాథన్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరిశోధించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో 'శోధన' సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్పులపై సర్వే చేశారన్నారు. రామచంద్రన్ గత ఎనిమిది సంవత్సరాలుగా కేరళ ప్రభుత్వం ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారని తెలిపారు. ఆదివారం . ఉదయం 10 గంటలకు ప్రారంభం అయ్యే సదస్సులో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని రాంభూపాల్ కోరారు.



అనంతపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తదితరులు

దేవున్నీ వదలని చంద్రబాబు : వైసిపి

ప్రజాశక్తి-అనంతపురం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన స్వార్థ రాజకీయాల కోసం దేవున్ని కూడా వదలడం లేదని వైసిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి లడ్డూ వ్యవహారంలో జరుగుతున్న ప్రచారంలో చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా వైసిపి ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా నియోజకవరాల్లో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్తలు ముఖ్య నాయకులు పూజలు నిర్వహించారు. చంద్రబాబు స్వార్థ రాజకీయాలకు శ్రీవారిని వాడుకోవడం దురదష్టకరం అన్నారు. పాలనలో వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎసిఎయు-19 పురుషుల జట్టుకు వీరారెడ్డి ఎంపిక

ప్రజాశక్తి-అనంతపురం



అనంతపురం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) అండర్-19 పురుషుల జట్టుకు జిల్లాకు చెందిన కెహెచ్.వీరారెడ్డి ఎంపికైనట్లు ఫీల్డింగ్ కోచ్ గులాం ఖాదీర్‌బాషా తెలిపారు. ఇతడు వచ్చేనెల 4వతేదీన మొహాలీలో జరిగే బిసిసిఐ వినూ మన్కడ్ ట్రోఫీలో పాల్గొననున్నట్లు తెలిపారు. అనంతపురంలోని ఎడమచేతి వాటం బ్యాటర్ వీరారెడ్డి 2024-25 సీజన్‌లో ఇంటర్ జోనల్, ఇంటర్ జిల్లా మ్యాచ్‌ల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎసిఎయు-19 పురుషుల జట్టుకు ఎంపిక కావడం గమనార్హమన్నారు.

మద్యాన్ని ఆదాయ వనరుగా మారుస్తారా..?

◆ నూతన మద్యం పాలసీ మరింత నష్టదాయకం
◆ ప్రభుత్వమే నాణ్యమైన మద్యాన్ని విక్రయించాలి
◆ ఐద్వా చర్చా వేదికలో వక్తలు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వి.సావిత్రి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 1వ తేదీ నుంచి ప్రవేశపెట్టనున్న నూతన మద్యం పాలసీ విధానం మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చేలా ఉందని, ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడే ఈ విధానాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని మహిళ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నూతన మద్యం పాలసీని వ్యతిరేకిస్తూ 'మద్యం ఆదాయ వనరా.. ప్రజా సంక్షేమమా'..! అన్న అంశంపై ఐద్వా ఆధ్వర్యంలో శనివారం ఉదయం చర్చ వేదిక నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అధ్యక్షతన స్థానిక ఎన్జీహోంలో నిర్వహించిన చర్చా వేదికలో రెడ్స్ సంస్థ అధ్యక్షురాలు భానుజా, ఇన్నర్ వీల్స్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీవల్లి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతి ప్రసాద్, ప్రగతి శీల మహిళా సంఘం అధ్యక్షురాలు సరస్వతి, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, జిల్లా కోశాధికారి చంద్రిక, జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి.సావిత్రి మాట్లాడుతూ ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చేందుకు నూతన మద్యం పాలసీని తీసుకొస్తున్నట్లు ఉందన్నారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ అంటూ వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రయివేటు వ్యక్తులతో అమ్మకాలు చేసేందుకు సిద్ధం అవుతోందన్నారు. తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందిస్తామంటూ ప్రభుత్వం చెప్పడం చూస్తుంటే రానున్న రోజుల్లో మద్యం ఏరులైపారే పరిస్థితులు కన్పిస్తున్నాయన్నారు. నూతన మద్యం పాలసీపై ప్రభుత్వం పునరాలోచించి, ప్రభుత్వమే మద్యం విక్రయించాలన్నారు. రెడ్స్ సంస్థ అధ్యక్షురాలు భానుజా మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాల జీవనం సాఫీగా సాగాలంటే మద్యం నియంత్రణే మార్గం అన్నారు. సమాజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మద్యాన్ని నియంత్రించాలని కోరారు. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ ప్రయివేటు వ్యక్తుల ద్వారా మద్యం విక్రయాలు జరిపితే అమ్మకాలకు అడ్డూఅదుపు లేకుండా పోతాయన్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులను ప్రోత్సహించి అమ్మకాలు చేస్తారన్నారు. మద్యం నియంత్రణకు ప్రస్తుతం ఉన్న షాపుల్ని చాలా వరకు తగ్గించాలని కోరారు. ఇన్నర్ వీల్స్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీవల్లి మాట్లాడుతూ ప్రతి మద్యం అలవాటు చాలా ప్రమాదకరం అని, దానికి దూరంగా ఉండాలన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి ఆదాయాన్ని సమకూర్చుకోవాలనే నిర్ణయాలపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలి మాట్లాడుతూ మద్యపాన నిషేధం కోసం గతంలో ఐద్వా, యువజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేసి అనేక షాపులను మూసి వేయించినట్లు గుర్తు చేశారు. ఇప్పుడు కూడా ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న జనావాసాల మధ్య ఉన్న షాపులను ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని చెప్పారు. ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతి ప్రసాద్ మాట్లాడుతూ బడి, గుడి జనావాసాల మధ్య మద్యం షాపులు నిర్వహించరాదని కోరారు. బెల్టుషాపులు ఏర్పాటు చేస్తే వాటిపై పోరాటం సాగిస్తామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ మద్యపానానికి బానిసలై మతిచెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. మద్యపానం పర్యావసనాలపై ప్రజలకు ప్రభుత్వం అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు సరస్వతి, ఐద్వా నాయకులు అరుణమ్మ, ప్రజానాట్యమండలి కష్ణవేణి, మహిళా సమాఖ్య నగర కార్యదర్శి జానకి, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు అనిత, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, జెవివి, సమత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కేంద్రం వైఖరి మారాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర

రాష్ట్రంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యాలయంలో కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్తంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 శాతం ఉత్పత్తి సాధించిన విశాఖ ఉక్కు ప్లాంట్ ఘనతను కేంద్రం గమనించాలన్నారు. కోవిడ్ సమయంలోనూ లాభాల్లో ఉందంటే దాని విలువలను తెలుసుకోవాలన్నారు. అలాంటి పరిశ్రమను సెయిల్‌లో విలీనం చేస్తే కేంద్రం పైసా సాయం చేయాల్సిన అవసరం లేకుండా పోతుందన్నారు. దీనికితోడు ప్లాంటుకు గనులు కేటాయించకపోవడంతో అదనంగా రూ.వేలకోట్లు వ్యయం చేయాల్సి వస్తోందన్నారు. 4000 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను దశలవారీగా తొలగించాలని యాజమాన్యం పూనుకున్నట్లు పత్రికల్లో ప్రకటనలు వస్తున్నాయన్నారు. దీన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తామన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, జనసేన పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపేంత వరకూ ఉద్యమం కొనసాగిస్తామన్నారు. ఇందులో భాగంగా అక్టోబర్ 1, 2, 3వ తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులు వెంకటనారాయణ, ఎజి.రాజమోహన్, ఎర్రిస్వామి, శ్రీనివాసరావు, ఆదినారాయణ, రాజేష్‌గౌడ్, చిరంజీవి, యేసురత్నం, రైతు, వ్యవసాయ కూలీ సంఘాలు నాయకులు మల్లికార్జున, నాగరాజు, కృష్ణ, రాయుడు, విద్యార్థి సంఘాల నాయకులు, కుళ్లాయిస్వామి, నరేష్, వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



కాతలేని వేరుశనగ చెట్లను చూపుతున్న సిపిఎం నాయకులు

వర్షాభావంతో చేతికందని పంటలు

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి - సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-రాప్తాడు

ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలన్నీ వర్షాభావంతో పూర్తిగా చేతికందకుండా పోయాయని, ప్రభుత్వం స్పందించి రైతులకు అన్ని విధాలా నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. రాప్తాడు మండల కేంద్రంలో రైతు పామల్ల కొండప్ప, ఇతర రైతులు సాగు చేసిన వేరుశనగ పంటలను శనివారం నాడు సిపిఎం నాయకులు పరిశీలించారు. ఏడు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేస్తే వర్షాభావంతో పూర్తిగా ఎండదశకు చేరుకుందని రైతు కొండప్ప సిపిఎం నాయకుల ఎదుట వాపోయాడు. ఎకరాకు రూ.30 వేలు ఖర్చు చేశానని, ప్రస్తుతం ఇదంతా నష్టపోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ వర్షాభావంతో ఈ ఏడాది ఖరీఫ్ పంటలను కూడా రైతులను నష్టపోవాల్సి వచ్చిందన్నారు. వేరుశనగ పంటకు దాదాపు రైతులు ఎకరాకు రూ.30 నుంచి రూ.35 వరకు ఖర్చు చేశారన్నారు. వర్షాభావంతో దిగుబడి రాక ఈ పెట్టుబడులు మొత్తం నష్టపోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.పోతులయ్య, జిల్లా కమిటీ సభ్యుడు టి.రామాంజనేయులు, కౌలు రైతు సంఘం అధ్యక్షుడు కదిరప్ప, రైతులు సుబ్బిరెడ్డి, వెంకట్రాముడు, గాండ్లపర్తి పోతులయ్య, జి.వెంకట రాముడు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్, డిసిఒలను సస్పెండ్ చేయాలి

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అవినీతి పనులు అన్నిటికీ డిసిఒ వత్తాసు పలకడం బాధకడం అని, తక్షణం వీరిద్దరిపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొర్రపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై అనేక అవినీతి, అక్రమ ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ తప్పులను డిసిఒ మురళీకృష్ణ ప్రోత్సహిస్తుండడం మరింత బాధాకరం అన్నారు. ప్రిన్సిపాల్‌పై వస్తున్న ఆరోపణలపై దళిత సంఘాలు, కెవిపిఎస్ పదే పదే అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. జిల్లా అధికారులు సకాలంలో చర్యలు తీసుకుని ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. కొర్రపాడు బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మిపై చర్యలు తీసుకునే ముందు డిసిఒ మురళీకృష్ణ పనితీరును జిల్లా అధికారులు సమీక్షించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేష్, జిల్లా నాయకులు బి.హరి, రాజా, జీవరత్నం, అక్కులప్ప, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

అనంతపురం క్రైం : ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది జిల్లావ్యాప్తంగా శనివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా అక్రమ మద్యం, ఇసుక, గంజాయి, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలపై దాడులు నిర్వహించి, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కేసులు నమోదు చేశారు. అలాగే హెల్మెట్, సీటు బెల్టు ధరించని వారిపై, త్రిబుల్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, డ్రంకన్ డ్రైవింగ్, తదితర రోడ్డు భద్రతా ఉల్లంఘనదారులపై మోటారు వాహనాల చట్ట ప్రకారంగా చర్యలు చేపట్టి జరిమానాలు వేశారు. ఇక ఏటిఎం కేంద్రాల వద్ద పటిష్ట భద్రత చేపట్టిన పోలీసులు సమస్యాత్మక, ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లోని పోలీస్ పికెట్ల సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.

పంటకోత ప్రయోగాలు



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఎడిఎ రవి

అనంతపురం : అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి రెవెన్యూ గ్రామంలోని అక్కంపల్లిలో శనివారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ ప్రయోగాన్ని అనంతపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.రవి పరిశృలించారు. ఇందులో భాగంగా వేరుశనగ పంటలో నిర్ణీత కొలతల్లో ప్రయోగం నిర్వహించగా 1,050 గ్రాముల దిగుబడి వచ్చినట్లు ఎడిఎ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయవిస్తరణ అధికారులు ఎం.శిరీషా, బి.మురళీకృష్ణ, గ్రామ ఉద్యాన సహాయకులు శివశంకర్, రైతులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : మండల కేంద్రంలోని రైతు రాజేశ్వరి చెందిన వర్షాధార వేరుశనగ పొలంలో మండల వ్యవసాయ అధికారి పి.సోమశేఖర్ ఆధ్వర్యంలో శనివారం పంటకోత ప్రయోగం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఒ రాజ్యలక్ష్మి, విహెచ్ఎ ఫరీసా పాల్గొన్నారు.

అభ్యుదయ కవి గుర్రం జాషువా

జయంతి కార్యక్రమాల్లో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

తన సాహిత్యం ద్వారా సమాజంలో మార్పు రావాలని కోరుకున్న అభ్యుదయ కవి మహాకవి గుర్రం జాషువా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కొనియాడారు. గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని గుర్రం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రధాన గేటుకు ఎదురుగా ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తు మేయర్, నాయకులు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాషువా సాహిత్యంలో ప్రతిఘటన, ఆర్తి, నిజాయితీ వంటివి ప్రధానంగా కనిపిస్తామన్నారు. వేదనభరిత జీవిత అనుభవంతో మానవ జీవితాన్ని తనదైన ప్రత్యేక మార్గంలో ఆవిష్కరించిన మహాకవి జాషువా అని కొనియాడారు. అనంతరం ఆర్ట్స్ కళాశాలలోని కామర్స్ సెమినార్ హాల్లో ఆచార్య జి.బాలసుబ్రమణ్యం అధ్యక్షతన జాషువా సాహితీ సదస్సు నిర్వహించారు.



జాషువాకు నివాళులర్పిస్తున్న ఐద్వా, కెవిపిఎస్ నాయకులు

ఈ కార్యక్రమంలో ఆర్‌డిటి తిప్పేస్వామి, పెద్దన్నగౌడ్, ఇంజనీర్ సుధాకర్‌బాబు, జి.బాలసుబ్రమణ్యం, నానీల నాగేంద్ర, హెచ్.నాగలింగయ్య, ఎస్సీ, ఎస్టీ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి, అంకే రామలింగయ్య, అంకే శ్రీనివాస్, అంకే మదన్‌మోహన్, పూజారి ఈరన్న, సాకే భాస్కర్, గద్దల నాగభూషణం పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : మహాకవి గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని ఐద్వా, కెవిపిఎస్ ఆధ్వర్యంలో నగరంలోని ఎన్‌జిఒ హోంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ జాషువా తన రచనల ద్వారా సమాజంలో కులవివక్ష, అంటరానితనం రూపుమాపేందుకు కృషి చేశారన్నారు. అయితే సమాజంలో నేటికీ అంటరానితనం, కులవివక్ష కొనసాగుతుండటం బాధాకరమన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా 5వ జిల్లా అధ్యక్షురాలు శ్యామల, జిల్లా కోశాధికారి చంద్రిక, జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, నాయకులు అరుణమ్మ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, నాయకులు అక్కులప్ప, ఎర్రిస్వామి, జీవా, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలి, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం కార్పొరేషన్ : సమ సమాజ నిర్మాణ స్ఫూర్తి ప్రదాత మహాకవి గుర్రం జాషువా అని మేయర్ మహమ్మద్ వసీం కొనియాడారు. గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని శనివారం నగరంలోని విగ్రహానికి డిప్యూటీ మేయర్ వాసంతితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ గుర్రం జాషువా గొప్ప కవి అన్నారు. ఆయన తన రచనలతో సమాజాన్ని మేల్కొల్పారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సైపుల్లా, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి 'స్వర్ణాంధ్ర'కు బ్రహ్మసముద్రం విద్యార్థులు

బ్రహ్మసముద్రం : జిల్లాస్థాయి 'స్వర్ణాంధ్రప్రదేశ్-2047'కు మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఇఒ ఓబుళపతి, ప్రధానోపాధ్యాయులు అశోక్‌కుమార్, స్పెషలాఫీసర్ మహాలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పిల్లలపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థి సమత, కెజిబివి పాఠశాలకు చెందిన నీలాక్షిత, జయచంద్రిక జిల్లాస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

శింగనమల సర్వేయర్‌గా స్టీఫెన్ వరకుమార్



శింగనమల : మండల సర్వేయర్‌గా స్టీఫెన్ వరకుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న గోవిందరాజులు ఆత్మకూరు మండలానికి బదిలీ కాక, ఆయన స్థానంలో కనగానపల్లి మండలంలో పని చేస్తున్న స్టీఫెన్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా స్టీఫెన్ మాట్లాడుతూ రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండి సర్వే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా రవి

ఉరవకొండ : ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామానికి చెందిన రవి ఎన్నికయ్యారు. ఈమేరకు శనివారం గుంతకల్లు ఆర్‌డిఒ కార్యాలయంలో నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం అందరినీ సమన్వయం చేసుకుని శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

ఎస్పీని కలిసిన డిజిహెచ్‌ఎస్‌ఎస్ నాయకులు

ఉరవకొండ : అనంతపురం కార్యాలయంలో ఎస్పీ జగదీష్‌ను దళిత గిరిజన హక్కుల సాధన సమితి వ్యవస్థాపకులు గోపాల్, రాష్ట్ర అధ్యక్షులు సాకే రమేష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలతోపాటు ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

ఉరవకొండ : అధిక ధరలకు వ్యవసాయ ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి శుభకర్ హెచ్చరించారు. శనివారం ఉరవకొండలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా బిల్ బుక్కులు, ఇన్‌వాయిస్‌లను పరిశీలించారు. ఎరువుల దుకాణదారులు రైతులకు ఎంఆర్‌పి ధరలకే ఎరువులు, విత్తనాలను విక్రయించాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

అన్నిమతాలను గౌరవిద్దాం

బ్రహ్మసముద్రం : మాజీ ముఖ్యమంత్రి జగన్ అన్నిమతాలను గౌరవించడం నేర్చుకోవాలని కొండాపురం సర్పంచి వనితా మల్లికార్జున హితవు పలికారు. శనివారం స్థానిక సచివాలయ కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్ కల్తీ నెయ్యి ఘటనను ఖండించకపోగా పరోక్షంగా మద్దతు ఇవ్వడం బాధాకరమన్నారు. అంతేగాకుండా హిందూమత విశ్వాసుల మనోభావాలను అవమానపరిచేలా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే జగన్ హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా జీవించాలి

పెద్దపప్పూరు : మండలంలోని గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని సిఐ రామసుబ్బయ్య, ఎస్ఐ గౌస్‌బాషా సూచించారు. శనివారం మండలంలోని ముచ్చుకోట, వరదాయపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో వారు మాట్లాడుతూ గ్రామాల్లో చిన్న, చిన్న వాటికి గొడవలకు వెళ్లకుండా సామరస్యంగా పరిష్కంచుకోవాలని సూచించారు. లేదా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థపై అవగాహన

రాయదుర్గం : మాస్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యాలయంలో సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ అధ్యక్షతన శనివారం న్యాయ వ్యవస్థ, చట్టాలు, రాజ్యాంగంపై ఎపి రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ మహిళా సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది లోకానంద మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 21 ప్రకారం దేశంలో నివసించే ప్రతి పౌరునికీ జీవించే హక్కు ఉంటుందన్నారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో పని చేసే మహిళా సభ్యులకు కూడా రాజ్యాంగం మేరకు హక్కులు ఉన్నాయన్నారు. వారి పట్ల వివక్ష చూపరాదన్నారు. ఆ సామాజిక వర్గంపై దాడి జరిగితే 2017 చట్టం ప్రకారం శిక్ష తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఐ సిటిసి కౌన్సిలర్ కృష్ణమూర్తి, మాస్ ఎడ్యుకేషన్ సొసైటీ సిబ్బంది, ఎయిడ్స్ కంట్రోల్ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్‌దుకాణాల్లో జొన్నలు

బొమ్మనహాల్ : మండలవ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో ప్రతి కార్డుదారునికీ మూడు కిలోల జొన్నలు పంపిణీ చేయనున్నట్లు డీటీ సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీలర్లు ప్రతి కార్డుదారుడికీ జొన్నలు అందించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. జొన్నలు పంపిణీ చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇకెవైసికి నెలాఖరు వరకు అవకాశం

గుమ్మఘట్ట : మండల పరిధిలోని 15 పంచాయతీల్లో ఈనెలాఖరు వరకూ ఈక్రాప్ నమోదుపాటు ఇకెవైసి చేయించుకోవచ్చని వ్యవసాయ శాఖ ఎఒ నిర్మల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలవ్యాప్తంగా ఇప్పటి వరకూ దాదాపు 97 శాతం ఈక్రాప్, ఇకెవైసి పూర్తయిందన్నారు. మిగిలిన వారు కూడా చేయించుకోవాలని కోరారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కుందుర్పి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న గృహ నిర్మాణ, సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ లక్ష్మీనరసింహా సూచించారు. శనివారం మండలంలోని తెనగల్లు గ్రామంలో నూతనంగా చేపట్టిన గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ మారుతి, పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా, మండల సాక్షరభారత్ కోఆర్డినేటర్ నాగేంద్ర, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుధామణి, ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్, గహ లబ్ధిదారులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంచుకుంటేనే ఉద్యోగావకాశాలు

రాప్తాడు : విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంచుకుంటే ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయనిశ్రీవెంకటేశ్వర ఇన్సిటుట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల కరస్పాండెంట్ బివిఆర్.శర్మ, ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి, వైస్‌ఛైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి సూచించారు. శనివారం మండలంలోని స్థానిక శ్రీవెంకటేశ్వర ఇన్సిటుట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. ముఖ్యంగా నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా ఎక్కడైనా రాణించవచ్చన్నారు. అనంతరం సీనియర్ విద్యార్థులను జూనియర్ విద్యార్థులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎండీ వెన్నపూస రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ టి.విష్ణువర్ధన్, ఎఒవి వెంకటశివారెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ డి.మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పింఛన్ల పంపిణీ : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ : అక్టోబర్ 1వ తేదీన జిల్లా వ్యాప్తంగా సామాజిక భద్రతా పింఛన్లను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పథకం పింఛన్లు, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీన ఉదయం 6 గంటలకు జిల్లాలో పింఛన్ల పంపిణీ ప్రారంభం కావాలన్నారు. సంబంధిత అధికారులు ముందుగానే పింఛన్ మొత్తాన్ని డ్రా చేసుకోవాలని సూచించారు. ఇక జిల్లాలో విస్తతంగా స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్డీఏ పీడీ ఓబులమ్మ, ఆర్డీఓల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు యూనిఫాం అందజేత

ప్రజాశక్తి-గుత్తి

ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగంగా గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం గుత్తి కోట రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే గుత్తి సీనియర్ డిఎంఇ ప్రమోద్, ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారిణి ఫ్లొరెన్స్ దీపా, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు సి.విజయభాస్కర్, సీనియర్ సిటిజన్ సూర్య నారాయణరెడ్డి, జెమినీ ఎలక్ట్రానిక్స్ అధినేత కెఇ. సురేష్‌గౌడ్, విశ్రాంత వార్డెన్ మల్లికార్జునరావు, నాయకులు పి.వెంకటరామిరెడ్డి, చిరంజీవి, ఓబులేసు, వీరార్జున, కోటగైడ్ రమేష్, సత్యనారాయణరెడ్డి, ఆటో యూనియన్ నాయకులు రామాంజీ, నాగార్జున, నజీర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్ లో గుత్తి కోట సంరక్షణ సమితి సహకారంతో ఆర్ఆర్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 'డాన్స్ గుత్తి డాన్స్' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మాకం శ్రీకాంత్, రిటైర్డ్ హెచ్ఎం నాగరాజురావు, డాక్టర్ ఎం.శాంతి ప్రియ, జెవివి రాష్ట్ర కార్యదర్శి హరి ప్రసాద్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు యూనిఫాం అందజేస్తున్న అధికారులు

భగత్‌సింగ్ స్ఫూర్తితో ముందుకు సాగుదాం

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

భారతదేశానికి స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని మేయర్ మహమ్మద్ వసీం పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని నగరంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇంక్విలాల్ జిందాబాద్ అంటూ భారత యువత గుండెల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపి, బ్రిటిష్ వారి వెన్నులో వణుకు పుట్టించిన విప్లవవీరుడు భగత్‌సింగ్ అన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని, ఆయన చూపిన బాటలో నడుస్తూ సమాజం కోసం పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి, కార్పొరేటర్లు సైపుల్లా, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తు మేయర్, నాయకులు

రాయదుర్గం : భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పూర్వ విద్యార్థి సంఘం నాయకులు ఆవుల మనోహర్ భగత్‌సింగ్ జీవిత చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొట్రెష్, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతపురం : ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ, నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్ట్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.విష్ణుప్రియ, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకుడు సుంకర రమేష్ మాట్లాడుతూ నేటి యువత భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు జి.ప్రసిల్లా, జయ బాలాజీరావు, కురుబ మహేంద్ర, ధోని, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తేజస్విని, భరత్, సాయి, సంతోష్‌నాయక్, ఎర్రిస్వామి, అమృత, తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుత్తి : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ మాట్లాడుతూ 23 ఏళ్లకే ప్రాణ త్యాగం చేసిన మహోన్నతమైన వ్యక్తి భగత్‌సింగ్ అన్నారు. యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ధను, బాలు, రవి, నవీన్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు. ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్, గుర్రం జాషువా చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల తాలూకా ఉపాధ్యక్షులు స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి జెన్నె కుళ్లాయిబాబు, కార్యదర్శి కె.రామ్మోహన్, నాయకులు వెంకటసుబ్బమ్మ, విజయలక్ష్మి, శామ్యూల్, షేక్షావలి, స్వామిదాస్, నారాయణరెడ్డి, గోవిందప్ప, చెన్నారెడ్డి, నారాయణశెట్టి, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

30న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమానపనికి సమాన వేతనం, మినిమం టైంస్కేల్, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు అవుట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం ప్రభుత్వ శాఖల్లోని అన్ని విభాగాల్లో ఉన్న ఉద్యోగులతో కలిసి స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో వైసిపి, నేడు టిడిపి ప్రభుత్వాలు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి, కృష్ణ, రవి, అమర్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు, ఉద్యోగులు

'శ్రీచైతన్య'లో ఘనంగా స్పోర్ట్‌మీట్



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎజిఎం సుబ్బారెడ్డి

అనంతపురం : నగరంలోని కమ్మభవన్ సమీపంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో శనివారం స్పోర్ట్స్‌మీట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీచైతన్య విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తర్వాత విద్యాసంస్థల పతాకావిష్కరణ చేసి గౌరవవందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఎజిఎం మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు చాలా అవసరమన్నారు. క్రీడల ద్వారా మానసిక ఒత్తిడిని జయించడంతోపాటు మానసికోల్లాసాన్ని పొందవచ్చన్నారు. అనంతరం వివిధ క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్, డీన్‌లు రిషిబాల, ముత్యాలన్న, సతీష్‌కుమార్, కోఆర్డినేటర్ రాధాకృష్ణనాయుడు, పిఇటిలు రవిరాజ్, విజయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో స్టేట్‌బ్యాంకు మేనేజర్ మృతి

నార్పల : మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంకులో మేనేజర్‌గా పని చేస్తున్న పూజారి ఆదినారాయణ (55) శనివారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతిచెందాడు. గుండెపోటుకు గురికాగానే వెంటనే కుటుంబ సభ్యులు అనంతపురం సవేరా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

చిన్నారిపై అత్యాచారయత్నం దారుణం

ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ-బాధితురాలికి పరామర్శ

ప్రజాశక్తి-పుట్లూరు

చిన్నారిపై వృద్ధుడు అత్యాచారయత్నానికి పాల్పడటం సిగ్గుచేటు అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విచారం వ్యక్తం చేశారు. మండలంలోని శనగలగూడూరు గ్రామంలో అత్యాచారయత్నానికి గురై శనివారం అనంతపురం ప్రభుత్వం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యాచారయత్నం సమయంలో బాలిక కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చి వ్యక్తికి దేహశుద్ధి చేసి పోలీసులకు పట్టించారన్నారు. అంతేగాకుండా 24 గంటల్లోనే పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఎవరైనా సరే ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

పోలీస్ వలయంలో ఎస్.గూడూరు గ్రామం

బాలికపై అత్యాచారయత్నం ఘటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ముగ్గురు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, 32 మంది స్పెషల్ పార్టీ పోలీసులు, సివిల్ పోలీసులు 40 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వీధుల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తప్పు చేసినవారికి వారిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జీవించాలని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు.



శనగలగూడూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ముగిసిన క్రీడాపోటీలు

రాప్తాడు : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు శనివారం విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన రాప్తాడు సర్పంచి తిరుపాల్, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ జి.లక్ష్మీదేవి, మండల విద్యాధికారి మల్లికార్జున మాట్లాడుతూ క్రీడలకు రాప్తాడు పుట్టినిల్లు అన్నారు. అయితే మండల, నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడానికి అవసరమైన క్రీడామైదానం మండల కేంద్రంలో లేకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంపై ఇప్పటికే ఎమ్మెల్యే పరిటాల సునీతతో చర్చించామని, మైదానం ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ బి.రాజశేఖర్‌రెడ్డి, పీడీలు ఎన్.కేశవమూర్తి, రవితేజారెడ్డి, నాగమణి, నాగవేణి, ఉపాధ్యాయులు, సాయిప్రసాద్, నల్లప్ప, కేశవయ్య, రోజారమణి, మేరీ, దాదాపు 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వెబ్ వార్తకు స్పందన

విద్యాశాఖలో పోస్టులన్నీ భర్తీ చేశాం

నార్పల : మండలంలోని ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేశామని మండల విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి తెలిపారు. 'సమస్యల వలయంలో నార్పల పాఠశాలలు' అన్న ప్రజాశక్తి వెబ్ కథనానికి స్పందించిన మండల విద్యాధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ గతంలో మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు ఉండేవన్నారు. ముఖ్యంగా నార్పల బాలికల పాఠశాలలో అధికంగా ఉండటంతో సమస్యను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రత్యేక చొరవతో ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఇటీవల కాలంలో భర్తీ చేశామన్నారు. కాగా ఆకతాయిలు పడగొట్టిన ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానం ప్రహరీని కూడా త్వరలో నిర్మిస్తామన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

తాడిపత్రిరూరల్ : మండల పరిధిలోని కావేరిసముద్రం గ్రామ పరిసర ప్రాంతాల్లో పేకాట స్థావరంపై దాడి చేసి 8మందిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పక్కాగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేయగా పేకాట ఆడుతున్న 8మందిని అదుపులోకి తీసుకుని రూ.30వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నామినేటెడ్‌పై నిరాశ..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నామినేటెడ్ పదవులపై చాలా మంది ఆశలు పెట్టుకున్నారు. అందులో చాలా మంది గత ఎన్నికల్లో ఎమ్మెల్యే స్థానాలను సైతం వదులుకున్న వారున్నారు. మరికొంత మంది సీనియర్లుగానున్న వారూ ఉన్నారు. వారందరికీ న్యాయం జరుగుతుందని ఆశించారు. అయితే నామినేటెడ్ పదవుల పంపకాలు ఇటీవలే జరిగాయి. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కేవలం ఒక్కటే ఛైర్మన్ స్థానం రాగా ఐదుగురికి సభ్యులుగా నియమించారు .సభ్యులుగా నియమించిన వారిలో ఇద్దరు సీనియర్ నాయకులుగానున్నారు. గోనుగుంట్ల విజయ్‌కుమార్, కాటమయ్యలు సీనియర్లు. వీరు ఛైర్మన్ స్థానాలను ఆశించిన వారిలోనూనున్నారు. వీరికి కేవలం సభ్యులుగా నియమించడం పట్ల వారి మద్దతుదారులు బాహాటంగానే అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సభ్యులుగా నియమించే కంటే ఇవ్వకున్నా బాగుండున్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుండటం గమనార్హం. ఇకపోతే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఐదుగురు మాజీ ఎమ్మెల్యేలు తమ స్థానాలను వదులుకున్నారు. వారికి తగిన ప్రాధాన్యతనిస్తామని ఆ సమయంలో ప్రకటించారు. కాని వారిలో ఏ ఒక్కరికీ నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించలేదు. ప్రధానంగా ధర్మవరం అసెంబ్లీ స్థానాన్ని వదులుకున్న పరిటాల శ్రీరామ్‌కు శాప్ ఛైర్మన్ పదవి లభిస్తుందని పెద్దఎత్తున ప్రచారం సాగింది. ఎందుకంటే ధర్మవరంలో టిడిపి నాయకులెవరూ లేని సమయంలో ఆయన్ను అక్కడ ఇన్‌ఛార్జీగా నియమించారు. చివరి నిమిషంలో ఆ స్థానాన్ని బిజెపికి అప్పగించారు. అయినా సర్దుకుని బిజెపికి మద్దతుగా ఎన్నికల్లో ప్రచారం చేసి, విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇటువంటి సమయంలోనూ టిడిపిని అక్కడ నడిపించే బాధ్యత ఆయనపైనే ఉంది. ఇటువంటి వ్యక్తికి నామినేటెడ్ ఇవ్వకపోవడంపై వారి మద్దతుదారుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇక మడకశిర నియోజకవర్గంలో ఈరన్న కుమారుడు డాక్టర్ సురేంద్రకు టిక్కెట్టు ప్రకటించి చివరి నిమషంలో మార్పు చేశారు. వారికి కూడా నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తారని ఆశించారు. కాని కూడా నిరాశనే ఎదురైంది. గుంతకల్లులో మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్ గడిచిన ఐదేళ్లు పార్టీని నడిపిస్తూ వచ్చారు. ఆయనకు కాకుండా చివరి నిమిషంలో మార్పు చేసి వైసిపి నుంచి టిడిపి చేరిన కర్నూలు నాయకులు గుమ్మనూరు జయరాంకు అవకాశం కల్పించారు. ఇక అనంతపురం నగరంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరికి సీటు ఇవ్వలేదు. దగ్గుపాటి ప్రసాద్‌కు ఇచ్చారు. అయితే ప్రభాకర్‌చౌదరికి నామినేటెడ్ పదవీ ఏదీ దక్కలేదు. అనంతపురం పార్లమెంటు గతంలో పోటీ చేసిన జెసి.పవన్‌కుమార్‌రెడ్డికి ఈసారి టిక్కెట్టు లేదు. ఈయనకు నామినేటెడ్‌లో చోటు లభించలేదు. ఇంత మంది సీనియర్లు పార్టీ అధికారంలోకి వచ్చిన సమయంలో పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. వీరందరికీ గత ఎన్నికల్లో టిక్కెట్టు కూడా ఇవ్వలేదు. మార్పులు చేశారు. వీరు విజయంలోనూ తమ వంతు పాత్రను పోషించారు. వీరందరికీ ఏ రకంగా పదవుల్లో న్యాయం చేయనున్నారన్న చర్చ ఆ పార్టీ వర్గాల్లో నడుస్తోంది.

ఇళ్ల అవినీతిపరులపై చర్యలు తీసుకుంటాం

'మన ఇల్లు-మన గౌరవం'లో ఎమ్మెల్యే కాలవ



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

వైసిపి పాలనలో జగనన్న కాలనీల పేరిట జరిగిన అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హెచ్చరించారు. 'మన ఇల్లు- మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా రాయదుర్గంలోని మోడల్ కాలనీలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేపట్టి అసంపూర్తిగా ఉన్న ఇళ్ల పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ముఖ్యంగా గత వైసిపి పాలనలో ఇళ్ల లబ్ధిదారులకు ఇచ్చిన భూ సేకరణలో ఆ పార్టీ నాయకులు రూ.కోట్లలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అవినీతి పరులపై కేసులు నమోదు చేసి శిక్షిస్తామన్నారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీలోగా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, పురపాలక సంఘం అధ్యక్షులు పొరాళు శిల్ప, తహశీల్దార్ నాగరాజు, గృహ నిర్మాణ సంస్థ డిఇ రంగారెడ్డి, ఎఇ జయచంద్ర, మున్సిపల్ వార్డు సభ్యులు ప్రశాంతి, జ్యోతి, గోవిందరాజులు, శ్రీనివాసరెడ్డి, టిడిపి నాయకులు నాగరాజు, ఈనాయత్ బాషా, పురుషోత్తం, భారతి, సుమలత, ధనార్జున, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని చెరువు కట్ట సమీపంలో ఉన్న లేఅవుట్ లో శనివారం గృహ నిర్మాణాలపై కమిషనర్ బి.జబ్బార్ మియా ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టంగా చేపట్టిన గృహ నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు లేఅవుట్లలో నిలిచిపోయిన గృహాలను పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారిణి కళ్యాణి, తహశీల్దార్ డి.ఓబులేసు, ఇఒఆర్‌డి శివాజీరెడ్డి, హౌసింగ్ ఎఇ ఎస్.సూర్యనారాయణ, మెప్మా అధికారులు సుమన దుర్గ, సురేఖ, ఆర్‌పిలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల పరిధిలోని బుక్కాపురం గ్రామ సచివాలయంలో శనివారం 'మన ఇల్లు.. మన గౌరవం' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, ఇఒఆర్‌డి విజయశేఖర్ నాయుడు, హౌసింగ్ ఎఇ సుప్రజ, ఎంపిపి గంగాదేవి, సర్పంచి లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామ సచివాలయంలో శనివారం మన ఇళ్లు మన గౌరవం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శేషారెడ్డి, ఎంపిడిఒ యోగానందరెడ్డి, హౌసింగ్ ఎఇ లోకేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : పామిడి పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో 'మన ఇల్లు మన గౌరవం' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కత్తిమల ప్రభాకర్‌చౌదరి, రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ ఎఇ సంపత్‌కుమార్, ఇఒఆర్‌డి శశికళ, గృహ నిర్మాణ లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలోని సచివాలయం-2లో శనివారం 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మల్లికార్జున, పెద్దతిప్పయ్య మాట్లాడుతూ 2025 మార్చి నెలాఖరులోగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. తర్వాత జగనన్న కాలనీలో పెండింగ్‌లో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జివిస్.రామచంద్ర, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, హౌసింగ్ ఎఇ శివారెడ్డి, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



రేబిస్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

రేబిస్ వ్యాధిపై అవగాహన అవసరం

ఉరవకొండ : రేబిస్ వ్యాధి ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వైద్యాధికారి వెంకటేష్‌నాయక్ సూచించారు. శనివారం మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రేబిస్ డే నిర్వహించారు. ఈ స ందర్భంగా ఆయన మాట్లాడుతూ రేబిస్ వ్యాధి జంతువుల నుంచి మనుషులకు వ్యాపిస్తుందన్నారు. ముఖ్యంగా పిచ్చి కుక్క, పిల్లి, గుర్రం లాంటి జంతువులు కరవడం, పుండ్లపై నాకితే రేబిస్ వైరస్ మనుషుల్లోకి ప్రవేశిస్తుందన్నారు. కావున కుక్క కరిచిన వెంటనే గాయాన్ని సబ్బు నీటితో శుభ్రంగా కడిగి టించర్‌తో చురక వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి.షఫీ, స్వర్ణలత, స్టాఫ్ నర్సులు సునీత, కుమారి బాయి, ఫార్మాసిస్టు మంగమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ రాణి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి పల్లకి ఉత్సవం

ఉరవకొండ : మండల పరిధిలోని పెన్నోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి పల్లకి ఉత్సవం శనివారం సాయంత్రం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో కొలువుదీర్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రమేష్ బాబు, అర్చకులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యథావిధిగా ఆర్టీసీ బస్సులు

రాయదుర్గం : రాయదుర్గం ఉరవకొండ మధ్య ప్రయాణించే ఆర్టీసీ బస్సులు ఆదివారం నుంచి యథావిధిగా నడుస్తాయని రాయదుర్గం ఆర్టీసీ డిపో మేనేజర్ సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో కణేకల్ సమీపంలో వేదవతి నదిపై తాత్కాలిక రోడ్డు కోతకు గురైనందున రాయదుర్గం-ఉరవకొండ మధ్య ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిపివేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రోడ్డు మరమ్మతులు పూర్తయినందున ఆదివారం నుంచి యథావిధిగా బస్సులు నడుస్తాయని తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పోషకాహార మాసోత్సవాల్లో వక్తలు



శింగనమల మండలం పెరవలిలో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-శింగనమల

పౌష్టికాహారం తీసు కోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి సూచించారు. శనివారం మండల పరిధిలోని పెరవలి సెక్టార్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా రక్తహీనత, పిల్లల ఎదుగుదల, కాంట్రి మెంటరీ ఏ కింగ్, ఆహారంలో వైవిధ్యతపై వివరించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో లభించే ఆకుకూరలు, కూరగాయలు, తక్కువ ధరకు లభించే పండ్లు వంటికి తీసుకోవాలన్నారు. వీటితోపాటు పిండి పదార్థాలు, విటమిన్లు, మినరల్స్ వంటివి తీసుకుంటే రక్తహీనత తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రమణమ్మ, ప్రసన్నరాణి, అంగన్వాడీ హెల్పర్లు అరుణ, అచ్చమ్మ తల్లులు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోని చీకలగురికిలోని 2వ అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ విజయకుమారి సంపూర్ణ పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు శారద, శ్రీలక్ష్మి, హేమలత, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని బొందలవాడ గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ భారతి, సూపర్‌వైజర్ మధుమాలిని మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. తద్వారా రక్తహీనత తగ్గి పుట్టబోయే పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు నిర్వహించారు. తర్వాత అంగన్వాడీ పరిధిలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ లావణ్య, ఎఎన్ఎం చంద్రకళ, అంగన్వాడీలు, వైద్యసిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : నవజాత శిశువు మొదలుకుని గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఎంపిడిఒ దాసానాయక్ సూచించారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సూపర్‌వైజర్లు రామంజినమ్మ, ఖాసీంబి అధ్యక్షతన పోషక మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఓబులపతి, వైద్యాధికారి రాజేష్‌కుమార్, ఎఒ నందకిషోర్, సెక్టార్ లీడర్లు తిప్పేరమ్మ, సుజాత, వరలక్ష్మి, అనిత, సుజాత, త్రివేణి, అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

మతం పేరుతో విధ్వంస, విభజన రాజకీయాలు తగదు

అనంతపురం : మతం పేరుతో రాష్ట్రంలో విధ్వంస, విభజన రాజకీయాలు చేయడం తగదని ఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు పోతుల నాగరాజు శనివారం ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ రాజకీయాలు వదిలి... కేవలం కుల, మతం, కక్షలు, ఆరాచక రాజకీయాలు చేస్తుండటం బాధాకరమన్నారు. మరోవైపు ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా రాజ్యమేలుతోందన్నారు. విద్య, వైద్యం వ్యాపారం చేయడానికి ప్రయివేట్, కార్పొరేట్ సంస్థలకు రాష్ట్ర రాజధాని కేంద్రంలో అధికార పార్టీకి అనుకూలమైన వారికి తక్కువ ధరకు భూములు అప్పగించే కుట్ర జరుగుతోందన్నారు. ఇవన్నీ గాలికి వదిలి కేవలం కులం, మత రాజకీయాలు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు స్పందించి అభివృద్ధి సంక్షేమంపై దృష్టి సారించాలని సూచించారు.

ఆర్ఇఎఫ్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడిగా నాగభూషణం

అనంతపురం : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏర్పడిన రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఆర్ఇఎఫ్) రాష్ట్ర శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎండి నాగభూషణం నియమితులయ్యారు. శనివారం స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఆర్ఇఎఫ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగభూషణంను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హెచ్.రామచంద్ర మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉద్యోగుల హక్కులు, ప్రయోజనాల కోసం పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వలగొండ రామకృష్ణ, జిల్లా గౌరవాధ్యక్షుడు కోటి మల్లేష్, ఆర్ఇఎఫ్ నాయకులు బొడిగొల్ల నాగేశ్వరావు, ఉమాశంకర్, కుళ్లాయప్ప, నాగన్న, శ్రీకాంత్, నారాయణస్వామి, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన 'స్వచ్ఛత హి సేవ'

యల్లనూరు : మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో శనివారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నిరుపయోగ వస్తువుల నుంచి తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి విజయశేఖర్‌నాయుడు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గం : స్వచ్ఛత హి సవ కార్యక్రమంపై భాగంగా జిల్లాస్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో రాయదుర్గం ప్రభుత్వ కళాశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయిలో బహుమతులు అందుకున్నారు. 'స్వచ్ఛత' అంశంపై ఆంగ్ల మాధ్యమంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థిని ఎ.ఎం.సాయికీర్తన మొదటి బహుమతి, రఫీయా, అమృత తృతీయ బహుమతి అందుకున్నారు. వీరికి జిల్లా వృత్తి విద్య అధికారి వెంకటరమణనాయక్ బహుమతులు అందజేశారు. ఆయా విద్యార్థులను జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరేష్ అభినందించారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో శనివారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినులు వేస్టు వస్తువుల ద్వారా తయారు చేసిన కళాఖండాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ ఆంజనేయులు, ఎంపిడిఒ యోగానందరెడ్డి, ఇఒఆర్‌డి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సరోజ, ఎస్ఒ మాధవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



పుట్లూరులో వస్తువులను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు